క్లుప్తంగా

క్రమశిక్షణ అలవరుచుకోవాలి



గ్రాడ్యుయేషన్ డేలో డీఎస్పీ

నగరి: పాఠశాల స్థాయి నుంచి విద్యార్థులకు క్రమశిక్షణ అలవడాలని డీఎస్పీ సయ్యద్ మొహమ్మద్ అజీజ్ అన్నారు. శుక్రవారం స్థానికంగా ఉన్న ఒక ప్రైవేటు పాఠశాలలో నిర్వహించిన ప్రీప్రైమరీ, ప్రైమరీ గ్రాడ్యుయేషన్ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి క్రమశిక్షణ అవసరమని, విలువలతో కూడిన విద్యను అభ్యసించాలని కోరారు. ప్రతి దశలోను తమ ప్రతిభను చూపిస్తూ ముందుకు వెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో భోజనాలు పంపిణీ



భోజనాలు వడ్డిస్తున్న వెంకటస్వామి, నాగమ్మ కుటుంబ సభ్యులు

కార్వేటినగరం: రాస్ ఆధ్వర్యంలో కార్వేటినగరంలో నిర్వహిస్తున్న వృద్ధాశ్రమంలో శుక్రవారం భోజన వసతి కల్పించారు. మేజర్ పంచాయతీ కార్వేటినగరం పరిధిలోని సుద్దగుంట గ్రామానికి చెందిన వెంకటస్వామి, నాగమ్మ దంపతుల జ్ఞాపకార్థం శుక్రవారం వారి కుటుంబ సభ్యులు వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు, కోటేశ్వరరావు అన్నదానం చేశారు. పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. నాగయ్య, రాస్ కో–ఆర్డినేటర్ ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు



సహపంక్తి భోజనాలు

నగరి: పట్టణ పరిధిలో బైపాస్ కూడలి సమీపంలో ఉన్న శ్రీధర్మశాస్తా అయ్యప్ప స్వామి ఆలయంలో అయ్యప్ప స్వామి జన్మనక్షత్రమైన ఉత్తరా నక్షత్ర పూజలు శుక్రవారం వైభవంగా నిర్వహించారు. అయ్యప్ప పాటల భజనలు, అర్చన మంత్రాలను అధిక సంఖ్యలో అయ్యప్ప భక్తులు భజనలు చేయడంతో ఆలయ ప్రాంగణంలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా ఆలయంలో భక్తులకు సహపంక్తి భోజనం పెట్టారు. వాసు, పుష్పలత ఈ కార్యక్రమానికి ఉభయదారులుగా వ్యవహరించారు. కార్యక్రమంలో భక్తులు కన్నప్ప, మునస్వామి, ఎల్లప్పరెడ్డి, రమేష్ బాబు, సురేష్, దుర్గాప్రకాష్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



మజ్జిగ, అంబలి, గంజి పంపిణీ చేస్తున్న వైద్యులు

నగరి: ఓంశక్తి ఆలయం వద్ద వేసవిని పురస్కరించుకొని పాదచారులకు చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ చలివేంద్రాన్ని డాక్టర్ రామచంద్రన్, డాక్టర్ జన్నత్, డాక్టర్ ఆంబ్రోస్ విల్సన్‌లు ముఖ్యఅతిథులుగా పాల్గొని ప్రారంభించారు. పాదచారులకు మజ్జిగ, అంబలి, గంజి అందించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు జ్యోతినాయుడు మాట్లాడుతూ ప్రతి వేసవిలో ఆలయం వద్ద చలివేంద్రం ఏర్పాటు చేస్తామన్నారు. వేసవి కాలం ముగిసేవరకు ఆలయం వద్ద ప్రతిరోజు 250 మందికి మజ్జిగ, అంబలి, గంజి పంపిణీ చేస్తామన్నారు. ముఖ్యంగా తిరుమలకు పాదయాత్రగా వెళ్లే భక్తుల కోసం ఈ ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో చలివేంద్రం దాతలు ప్రభాకర్, కైలాసం, రమేష్, మోహన్, ఆదిశివ, ఆలయ సేవకులు పాల్గొన్నారు.

నింద్రలో..

నింద్ర: మండల కేంద్రంలో శుక్రవారం స్థానిక మండల సముదాయం వద్ద తహశీల్దార్ శేషగిరిరావు చలివేంద్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా అయన మట్లాడుతూ ఎండలు తీవ్రంగా ఉండడంతో చలివేంద్రం ప్రారంభించామని తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజలకు అందుబాటులో ఉంచుతామన్నారు. శ్రీనివాస మిల్క్ వారి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ బాబురెడ్డి, పంచాయతీ కార్యదర్శి ధరణీ, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

పేడదిబ్బల తొలగింపు

పాలసముద్రం: మండలంలో కేజే పురం పంచాయతీలోని అన్ని గ్రామాల్లో శుక్రవారం ఎంపీడీఓ విద్యావతి తమ సిబ్బందితో కలసి రోడ్డుకు ఇరువైపులా ఉన్న పేడదిబ్బలు, ముళ్ల పొదలను తొలగించారు. బలిజకండ్రిగలో మురికి కాలువల్లో పూడిక తీత పనులు చేపట్టారు. ఎంపీడీఓ విద్యావతి మాట్లాడుతూ గ్రామాల్లో ప్రతి ఒక్కరూ పరిసరాలు పరిశుభ్రత పాటించాలని. ఆమె వెంట మండల విస్తరణాధికారి రమేష్, పంచాయతీ కార్యదర్శి శంకర్, గ్రీన్ అంబాసిడర్లు ఉన్నారు.

గ్యాస్ దోచేస్తున్నారు..!

గ్యాస్ సిలిండర్ డెలివరీ కోసం 15 కిలోమీటర్ల వరకు ఎలాంటి రుసుం వసూలు చేయరాదనే నిబంధన. 15 కిలోమీటర్ల నుంచి 30 కిలోమీటర్ల వరకు సిలిండర్‌కు రూ.30 వసూలు చేయాలి. అయితే ఎక్కడా ఆ నిబంధనలు అమలు కావడం లేదు. వడమాలపేట మండలంలో 10 కిలోమీటర్లలోపే ఉన్న గ్రామాల్లో సిలిండర్లు డెలివరీ అవుతున్నా కనీసం రూ.70 వసూలు చేస్తున్నారు. ఆపై దూరాన్ని బట్టి మరింత అదనంగా వసూలు చేస్తున్నారని వినియోగదారులు వాపోతున్నారు.

– వడమాలపేట(విజయపురం)

- గ్యాస్ డెలివరీలో నిలువు దోపిడీ
- సిలిండర్‌పై అదనంగా రూ.70 వసూలు
- 15 కిలోమీటర్ల వరకు ఉచిత డెలివరీ నిబంధన
- డెలివరీ బాయ్స్‌కు గ్యాస్ ఏజెన్సీ యాజమాన్యాల వత్తాసు
- చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్న పౌరసరఫరాల అధికారులు



పగలే దోచుకొంటున్నారు

వడమాలపేట మండలంలో మొత్తం 22 పంచాయతీల్లో 88 గ్రామాలు ఉన్నాయి. ఈ గ్రామాలు మండల కేంద్రానికి 15 కిలో మీటర్లలోపే ఉన్నాయి. వీరందరికి గరుడ భారత్ గ్యాస్ వారు ప్రతి 15 రోజులకు ఓ సారి గ్యాస్ సరఫరా చేస్తున్నారు. అయితే డోర్ డెలివరీ పేరుతో వినియోగదారులను దోచుకొంటున్నారు. మండలంలో మొత్తం 3165 మందికి గ్యాస్ కనెక్షన్లు ఉండగా... వీరందరు భారత్ గ్యాస్ కంపెనీ సిలిండర్లనే వినియోగిస్తున్నారు. ఒక వినియోగదారుడి నుంచి రూ.70 చొప్పున అదనంగా నెలకు రూ.2 లక్షల నుంచి 3 లక్షల వరకు వినియోగదారుల నుంచి దోచుకొంటున్నారు.

ఇవీ నిబంధనలు

నిబంధనల ప్రకారం ఒక వినియోగదారుడు బుక్ చేసుకున్న సిలిండర్‌ను డెలివరీ చేసేందుకు నిర్వహణలో ఉన్న ఏజెన్సీలు వాహనాలు, డెలివరీ బాయ్స్‌ను అందుబాటులో ఉంచుకోవాలి. బాయ్స్‌కు వారే జీతాలు ఇవ్వాలి. అయితే ఏజెన్సీలు ఇక్కడే మోసం చేస్తున్నాయి. సొంతంగా ఆటోలు ఉన్న వారితో కలసి సిలిండర్లను డోర్ డెలివరీ చేసే బాధ్యతను వారికి అప్పగిస్తున్నారు. ఇలా వారి మధ్య కుదిరిన ఒప్పందం మేరకు ఏజెన్సీ నిర్వాహకులు ఆటోగాని, డెలివరీ బాయ్‌లకు గాని ఎలాంటి బాడుగ, జీతాలు చెల్లించరు. ఆటో యజమానే డెలివరీ చేసి వినియోగదారుల నుంచి వసూలు చేసుకోవాల్సి ఉంది. దీంతో ఆటో యజమానులు గిట్టుబాటు కోసం వినియోగదారులను ఇష్టం వచ్చినట్లు దోచేస్తున్నారు. ఒక డెలివరీ బాయ్ దూరాన్ని బట్టి కనీసంగా రూ.50 నుంచి రూ.70 వరకు వసూలు చేస్తున్నట్లు తెలిసింది.

ఫిర్యాదు చేస్తే...

డోర్ డెలివరీ పేరుతో అదనంగా వసూలు చేస్తున్న దానిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తే.. ఫిర్యాదు చేసిన వారికి సిలిండర్ ఇవ్వకుండా తిప్పిస్తున్నారు. దీంతో వినియోగదారులు ఫిర్యాదు చేయడానికి ముందుకు రావడం లేదు. ప్రశ్నించిన వారిని వేధింపులకు గురిచేయడం, అంతే కాకుండ డోర్ డెలివరీ చేయడం కుదరదని చెబుతున్నారు. అంతా గోడౌన్ దగ్గరకు వచ్చి తీసుకోవాలని నిర్వాహకులు చెప్పడంతో వినియోగదారులు ఫిర్యాదు చేయడానికి భయపడుతున్నారు.

ఫిర్యాదు చేస్తేనే చర్యలు

గ్యాస్ సిలిండర్ డోర్ డెలివరీని పౌర సరఫరాల అధికారులు పరిశీలించడం లేదు. నెలవారీగా ఏజెన్సీ నిర్వాహకుల నుంచి వస్తున్న డబ్బులు తీసుకొని మిన్నకుండి పోతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. సిలిండర్ డెలివరీ విషయంలో చాలా మంది వినియోగదారులు డెలివరీ బాయ్స్‌తో గొడవ పడి ఇబ్బందులు పడుతున్నారు. ఎవరైనా ఫిర్యాదు చేస్తే తప్ప అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. దీంతో దోపిడీ యథాతథంగా కొనసాగుతోందని స్థానిక ప్రజలు మండిపడుతున్నారు.

డోర్ డెలివరీకి అనుమతి లేదు

డోర్ డెలివరీ చేయాలన్న నిబంధన మాకు లేదు. అయినా మేం ప్రతి గ్రామానికి డోర్ డెలివరీ చేస్తున్నాం. రూ.50 మాత్రమే వసూలు చేయమని చెప్పాం. అయినా 70 రూపాయలు వసూలు చేస్తున్నారని మా దృష్టికి రాలేదు. –

చంద్రమౌళి, గరుడ భారత్ గ్యాస్ ఏజెన్సీ, వడమాలపేట

నిబంధనలు పాటించాలి

15 కిలోమీటర్ల వరకు గ్యాస్ సిలిండర్ డెలివరీ కోసం ఎలాంటి రుసుం వసూలు చేయరాదు. అలా వసూలు చేస్తే స్థానిక తహశీల్దార్‌కు ఫిర్యాదు చేయండి. ఫిర్యాదులపై తక్షణం స్పందిస్తున్నాం. ఏజెన్సీ వాళ్లు విధిగా నిబంధలను పాటించాలి.

- డీఎస్‌ఓ, తిరుపతి

వైఎస్‌ఆర్ సీపీ జోరు తగ్గలేదు



గోపిశెట్టిపల్లిలో ఎంపీటీసీ సభ్యుడు మురగయ్యను పరామర్శిస్తున్న మాజీ ఉప ముఖ్యమంత్రి



విశ్రాంత ఉపాధ్యాయుడు సుదర్శన్‌రాజు ఇంటివద్ద మాజీ ఉప ముఖ్యమంత్రి

– బాధిత కుటుంబాలకు డిప్యూటీ సీఎం పరామర్శ

కార్వేటినగరం: రాష్ట్రంలో వైఎస్‌ఆర్ సీపీ జోరు తగ్గలేదని, కార్యకర్తలు, నాయకులు నేటికీ పార్టీ బలోపేతానికి అహర్నిశలు కృషి చేస్తున్నారని రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి అన్నారు. శుక్రవారం కష్టాల్లో వివిధ పార్టీ నాయకులను ఆయన పరామర్శించారు. రోడ్డు ప్రమాదంలో గాయపడిన గోపిశెట్టిపల్లి ఎంపీటీసీ సభ్యుడు మురగయ్య, కృష్ణాపురం గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు సుదర్శన్‌రాజు అనారోగ్యంతో బాధపడుతున్నట్లు సమాచారం అందుకున్న ఆయన ఆయా గ్రామాలకు వెళ్లి బాధితులను పరామర్శించారు. మాజీ ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో వైఎస్‌ఆర్ సీపీకి తిరుగు లేని విజయాన్ని అందించడానికి సిద్ధంగా ఉండాలని కార్యకర్తలను మాజీ ఉప ముఖ్యమంత్రి ఆదేశించారు. కూటమి ప్రభుత్వం చేపడుతున్న అక్రమాలు, దౌర్జన్యాలు, హత్యా రాజకీయాలను ఎత్తి చూపుతున్న పత్రికలపై కూటమి ప్రభుత్వం కాలకూట విషాన్ని చిమ్ముతోందన్నారు. ఇది పత్రికా స్వేచ్ఛను హరించడమేనని అన్నారు. వైఎస్‌ఆర్ సీపీ మండల అధ్యక్షుడు శేఖర్‌రాజు, వైస్ ఎంపీపీ కార్తీక్‌రెడ్డి, రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి చందురాజు, సర్పంచ్ ధనుంజయవర్మ(కార్వేటినగర), మాజీ సర్పంచ్ అంకయ్య, ధనశేఖర్‌వర్మ, శేషాద్రి, అర్జునయ్య, శోభన్‌బాబు, వెంకటరత్నం, వెంకటస్వామి, ఐటీవి వింగ్ శీనురెడ్డి, సీనియర్ నాయకులు చిన్నబ్బ మందడి, రుక్మాంగధరెడ్డి, శ్రీనివాసులు, వైఎస్‌ఆర్‌సీపీ నాయకులు పలువురు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించండి



పుత్తూరు ఆర్టీసీ డిపో వద్ద ఉద్యోగుల ఆందోళన

- ఆందోళన ఉధృతం చేస్తాం
- ప్రభుత్వానికి ఎన్ఎంయూ అల్టిమేటం

పుత్తూరు: ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్ డిపార్ట్‌మెంట్ (ఏపీపీటీడీ) ఆధ్వర్యంలో నేషనల్ మజ్దూర్ యూనియన్ కార్మికులు రెండో రోజు శుక్రవారం స్థానిక ఆర్టీసీ డిపో ముందు గేట్ మీటింగ్ ఆందోళన చేపట్టారు. తిరుపతి జిల్లా అధ్యక్షుడు ఎస్.జె.పెరుమాళ్ మాట్లాడుతూ ఆర్టీసీలో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర వ్యాప్తంగా ఎన్ఎంయూ పోరాటాన్ని ప్రారంభించిందని తెలిపారు. ప్రభుత్వం న్యాయమైన సమస్యల పరిష్కారానికి ముందుకు రావాలని కోరారు. ఉద్యోగ భద్రతా సర్క్యులర్–2019 అమలు చేయాలని డిమాండ్ చేశారు. అక్రమ సస్పెన్షన్లు, తొలగింపులను వెంటనే ఆపాలని, గత నాలుగేళ్లగా ఆగిపోయిన ప్రమోషన్లను అమలు చేయాలని, మహిళా ఉద్యోగుల పిల్లల సంరక్షణ సెలవులను మంజూరు చేయాలని, గ్యారేజీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, ఎలక్ట్రికల్ బస్సులను ప్రభుత్వం కొనుగోలు చేయాలని, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సంస్థాగత వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించకపోతే ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో డిపో అధ్యక్షుడు ఎస్.సుందరం, కార్యదర్శి ఎం.శివకుమార్, యూనియన్ నాయకులు రమేష్‌బాబు, రాయులు, వినోద్‌కుమార్, ఎస్‌కే రెడ్డి, ఆర్ముగం, హేమంత్‌కుమార్, రమేష్, ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.

నెలాఖరు వరకు వడ్డీపై రాయితీ



ఎం.మంజునాథగౌడ్ కమిషనర్

పుత్తూరు: 2024–25 ఆర్థిక ఏడాదికి సంబంధించి ఆస్తి పన్ను బకాయిల మొత్తంపై 50 శాతం పన్ను రాయితీని ఈనెల 30వ తేదీ వరకు పొడిగించినట్లు మున్సిపల్ కమిషనర్ ఎం.మంజునాథగౌడ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత ఏడాది ఏప్రిల్ ఒకటి నుంచి ఇది వరకే చెల్లించిన ఆస్తి పన్నుల వడ్డీని ఈ ఆర్థిక ఏడాదిలో సర్దుబాటు చేస్తామని స్పష్టం చేశారు. అలాగే 2025–26 ఆర్థిక ఏడాదికి సబంధించిన పన్నుల మొత్తాన్ని ఏకమొత్తంగా చెల్లిస్తే 5 శాతం రాయితీని పొందవచ్చునని వెల్లడించారు. ఈ అవకాశాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇంటి, నీటి, ఆస్తి పన్నులను సకాలంలో చెల్లించి పుత్తూరు పురపాలక సంఘ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. సెలవు దినాలైన ఆదివారాల్లో సైతం మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసి పన్నులను స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ఆన్‌లైన్ సీడీఎంఏ వెబ్‌సైట్‌లో కూడా పన్నులు చెల్లించవచ్చునని వెల్లడించారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి



వేరుశనగ పంటను పరిశీలిస్తున్న అధికారులు

పుత్తూరు: రైతులు మెరుగైన వ్యవసాయ యాజమాన్య పద్ధతులు పాటించాలని పుత్తూరు ఏడీఏ రమేష్‌రాజు తెలిపారు. రాష్ట్ర సేంద్రీయ ఉత్పత్తుల ధ్రువీకరణ అథారిటీ ఆధ్వర్యంలో శుక్రవారం మండల పరిధిలోని తొరూరు గ్రామంలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయాధికారి కోదండయ్య మాట్లాడుతూ అధిక రసాయనిక ఎరువుల వినియోగం నివారించాలని, విత్తన ధ్రువీకరణకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. అనంతరం రైతుల నుంచి విత్తన నమూనాలను సేకరించి, పురుగు మందుల అవశేషాల పరిశీలన నిమిత్తం బెంగళూరు ల్యాబ్‌కు పంపించారు. కార్యక్రమంలో ఏపీఎస్ఓపీసీఏ జిల్లా ఎవాల్యూయేటర్ కె.మునిశేఖర్, బీపీఏలు మోహన్, శ్రీవల్లి, విష్ణుప్రియ, రైతులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ అంతరాయం లేకుండా చూడాలి



ఆక్రమణల తొలగింపుపై అవగాహన సమావేశం

కార్వేటినగరం: మేజర్ పంచాయతీ కార్వేటినగరంలో ట్రాఫిక్ అంతరాయం లేకుండా చూడాలని నగరి డీఎస్పీ సయద్ మహ్మద్ అజీజ్ అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ చంద్రమౌళి, సీఐ హనుమంతప్ప, తహశీల్దార్ నాగరాజు, ఈఓపీఆర్డీ నాగరత్నమ్మలతో కలసి ట్రాఫిక్ సమస్యలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ మండపం వీధి, బజారు వీధుల్లో రోడ్డు ఆక్రమణలు ఉన్నాయని, దీంతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పంచాయతీ అధికారులు అనధికారికంగా ఉన్న ఆక్రమణలను గుర్తించి పోలీసుల సహకారంతో తొలగించాలని సూచించారు.

అరవయ్యేళ్ల పాఠశాల నిర్వీర్యం



ఎంఈఓకు వినతి పత్రం అందిస్తున్న గోవిందరెడ్డి

గంగాధరనెల్లూరు: అరవయ్యేళ్లుగా తమ గ్రామంలో ఎందరో విద్యార్థులకు భవిష్యత్తును కల్పించిన పాఠశాల ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో నిర్వీర్యం అవుతోందని గ్రామస్తులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని తిరువీధి కుప్పం గ్రామంలో ఉన్న పాఠశాలను పచ్చని చెట్ల ప్రక్కతిలో అందంగా రూపుదిద్దామని, ప్రస్తుత కూటమి ప్రభుత్వం పాఠశాలలో విద్యార్థులు తక్కువగా ఉన్నారనే నెపంతో దీన్ని లేకుండా చేయడానికి కసరత్తు చేస్తున్నారని ఆరోపించారు. తమ గ్రామంలోని విద్యార్థులు వేరే గ్రామాలకు వెళ్లి చదవడం కష్టతరమని తెలిపారు. స్థానిక ప్రజాప్రతినిధులు సర్పంచ్ వెంకటేష్ రెడ్డి, ఎంపీటీసీ ఉమామహేశ్వరి, నాయకులు గోవిందరెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ వేలు మొదలి, స్కూల్ కమిటీ చైర్మన్ నీలకంఠలు మండల విద్యాధికారి ఆంజనేయులుశెట్టికి శుక్రవారం వినతి పత్రం అందించారు. తమ పాఠశాలను తమ గ్రామంలోనే కొనసాగించాలని కోరారు.

వైఎస్‌ఆర్ సీపీ మండల అధ్యక్షుడిగా కేఆర్ వెంకటరెడ్డి



కార్వేటినగరం: గంగాధరనెల్లూరు మండలం వైఎస్‌ఆర్ సీపీ మండల అధ్యక్షుడిగా కేఆర్ వెంకటరెడ్డి నియమించినట్లు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఆదేశాలు అందాయి. నూతన మండల అధ్యక్షుడు కేఆర్ వెంకటరెడ్డి మాట్లాడుతూ తన నియామకానికి కృషి చేసిన మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి, మాజీ ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి, జీడీనెల్లూరు సమన్వయకర్త కృపాలక్ష్మికి కృతజ్ఞతలు తెలిపారు.

అధ్యాపకుడికి నేషనల్ అవార్డు



అవార్డు అందుకుంటున్న సివిక్స్ అధ్యాపకుడు సూర్యన్

పాలసముద్రం: మండలంలోని పాలసముద్రం ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకుడు సివిక్స్ సూర్యన్‌కి సర్వేపల్లి రాధకృష్ణన్ నేషనల్ అవార్డు అందుకున్నారని శుక్రవారం కళాశాల ప్రిన్సిపల్ హేమలత తెలిపారు. చిత్తూరు విజయం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో సూర్యన్ అవార్డు అందుకున్నారని తెలిపారు.

రావణబ్రహ్మ వాహనంపై ఆదిదంపతులు



రావణబ్రహ్మ వాహనంపై ఆదిదంపతులు

నగరి: పట్టణ పరిధిలోని శ్రీకామాక్షీ సమేత కరకంఠేశ్వర స్వామివారి ఆలయంలో నిర్వహిస్తున్న పంగుణోత్తర కల్యాణోత్సవ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం స్వామి, అమ్మవార్లను రావణబ్రహ్మ వాహనంపై ఊరేగించారు. ఈ సందర్భంగా ఆలయంలో అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. వాహనంపై ప్రత్యేక అలంకారంలో ఊరేగింపుగా వచ్చిన స్వామి, అమ్మవారికి భక్తులు కొబ్బరికాయలు కొట్టి, కర్పూర హారతులు ఇచ్చి దర్శించుకున్నారు. ఆలయ ధర్మకర్త సుబ్రమణ్యం ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ సేవలకు శ్రీకృష్ణదేవరాయ బలిజ సేవా సంఘం వారు ఉభయదారులుగా వ్యవహరించారు. అనంతరం ధ్వజావరోహణ కార్యక్రమం నిర్వహించగా బ్రహ్మోత్సవాలు ముగింపునకు చేరుకున్నాయి.

బాడీ బిల్డర్లకు అభినందనలు



దినేష్‌ను అభినందిస్తున్న డీఎస్పీ

నగరి: పుత్తూరు పట్టణానికి చెందిన బాడీ బిల్డర్లు దినేష్ తదితరులను డీఎస్పీ సయ్యద్ మహమ్మద్ అజీజ్ అభినందించారు. పళ్లిపట్టులో నిర్వహించే బాడీ బిల్డింగ్ పోటీల్లో పాల్గొనేందుకు దేహదారుఢ్య శిక్షణ పొందడానికి, పౌష్టికాహారం తీసుకోవడానికి అవసరమయ్యే ఖర్చులను గాను బాడీ బిల్డర్‌కు గతంలో ఆయన ఆర్థిక సాయం అందించారు. పోటీలో పాల్గొన్న దినేష్ గెలుపొంది కప్పు గెలుచుకున్నాడు. శుక్రవారం డీఎస్పీ కార్యాలయానికి తోటి క్రీడాకారులతో విచ్చేసి గెలుపొందిన కప్పును డీఎస్పీకి అందజేసి కృతజ్ఞతలు తెలుపగా ఆయన దినేష్‌ను అభినందించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

వడమాలపేట(విజయపురం): విద్యుత్ మరమ్మతుల కారణంగా వడమాలపేట మండలంలో శనివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ భాస్కర్ రాజు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు మండల పరిధిలోని ఐదు సబ్ స్టేషన్లు పరిధిలో మరమ్మతు పనులు జరుగుతుంది. ఇందులో భాగంగా విద్యుత్ అంతరాయం ఉంటుందని ఆయన పేర్కొన్నారు.

పుత్తూరులో..

పుత్తూరు: రూరల్ పరిధిలోని పైడిపల్లి, దిగువపుత్తూరు, పరమేశ్వరమంగళం సబ్‌స్టేషన్ల పరిధిలో శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏపీ ట్రాన్స్‌కో రూరల్ ఏఈ రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులు సహకరించాల్సిందిగా కోరారు.

కార్వేటినగరంలో..

కార్వేటినగరం: విద్యుత్ అంతరాయానికి విద్యుత్ వినియోగదారులు సహకరించాలని విద్యుత్ ఏడీఈ చంద్రబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ లైన్ల మరమ్మతులు విద్యుత్ తీగలకు తగులుతున్న చెట్లు, పిచ్చిమొక్కలను తొలగించడంలో భాగంగా శనివారం వెదురుకుప్పం, శ్రీరంగరాజపురం, కార్వేటినగరం మండలాల్లో ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తామన్నారు.

భూసమస్యల పరిష్కారానికే రీ సర్వే

పాలసముద్రం: రైతుల భూసమస్యల పరిష్కారానికే రీ సర్వే కార్యక్రమం చేపట్టారని తహశీల్దార్ అరుణ కుమారి తెలిపారు. శుక్రవారం క్రిష్ణజమ్మపురంలో జరుగుతున్న రీ సర్వే కార్యాక్రమాన్ని పరిశీలించారు. రైతులకు సమీక్ష సమావేశం నిర్వహించి తహసీల్దార్ అరుణ కుమారి, మండల సర్వేయర్ గణేష్ మాట్లాడుతూ రీ సర్వేలో భాగంగా నోటీస్‌లు అందుకున్న రైతులు ఏదైనా వ్యత్యాసాలుంటే సవరణ చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. కార్యక్రమంలో ఎంఆర్ఐ దేవి, వీఆర్ఓ వెంకటాచలం, శ్రీనివాసులు, తంగరాజ్, రమణయ్య, సర్వేయర్లు మునిరత్నం, హరి, అలీ, సోమశేఖర్ రైతులు పాల్గొన్నారు.

విధిగా పౌష్టికాహారం తీసుకోవాలి

నింద్ర: బాలింతలు, కిషోర బాలికలు ప్రతినిత్యం విధిగా పౌష్టికాహారం తీసుకోవాలని సూపర్ వైజర్ శ్యామల అన్నారు. శుక్రవారం మండలంలోని ఎలకాటూరు అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహారంపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలింతలు, కిషోర బాలికలు ఆహారం తీసుకునే విధానాలు, పరిసరాల పరిశుభ్రత, ఆహార శుభ్రత, చిరుధాన్యాలపై అవగాహన కల్పించారు.

స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దాలి

వెదురుకుప్పం: స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ పురుషోత్తం అన్నారు. శుక్రవారం మండలంలోని నల్లవెంగనపల్లె, అగ్గిచేనుపల్లె పంచాయతీల్లో ఇన్‌చార్జి ఎంపీడీఓ పురుషోత్తం ఆధ్వర్యంలో చెత్త సేకరణ కార్యక్రమాన్ని ముమ్మరంగా చేపట్టారు. సర్పంచ్ పుష్ప, వైఎస్‌ఆర్ సీపీ జిల్లా స్టీరింగ్ కమిటీ సభ్యుడు శివాజీ పాల్గొన్నారు.

బియ్యం అడిగితే లేదు అంటున్నారు

శ్రీరంగరాజపురం: ప్రభుత్వం అందించే రేషన్‌బియ్యం డీలర్‌ను అడిగితే లేదంటున్నారని తెల్లరేషన్‌కార్డు లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్థానికుల కథనం మేరకు శ్రీరంగరాజపురం రేషన్ డీలర్ లక్ష్మి వద్దకు సి.కె.పురం దళితవాడ గ్రామానికి చెందిన కొంతమంది మహిళలు బియ్యం వేసుకురావడానికి వెళ్లారు. అయితే డీలర్ లక్ష్మి ప్రభుత్వం నుంచి 60 శాతం మాత్రమే రేషన్ బియ్యం వచ్చాయని, వచ్చిన బియ్యం అయిపోయాయని సమాధానం చెప్పారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన బియ్యం అందించాలని అధికారులు డిమాండ్ చేస్తున్నారు.